క్లుప్తంగా

పోడు భూములకు పట్టాలివ్వాలి



మాచారెడ్డి : మండలంలోని ఎల్లంపేట, సోమారంపేట, అక్కాపూర్ గ్రామాల్లో పోడు వ్యవసాయం చేస్తున్న రైతులకు పట్టాలివ్వాలని ఏఐకేఎంఎస్ నాయకులు నర్సన్న,భూమన్నలు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అలీ, కిష్టయ్య, చిన్న, అలీ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు



రాజంపేట : రాజంపేట మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆదివారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, రాజంపేట గ్రామ అధ్యక్షుడు ముత్యపు సిద్దరాములు, మాజీ అధ్యక్షులు కొండా సురేందర్, బందం మల్లేశం చంద్రమౌళి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దోమకొండ మాజీ ఎంపీపీ..




దోమకొండ : దోమకొండ మాజీ ఎంపీపీ గంగు బాలరాజవ్వ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్,నాయకులు గంగు రమేశ్ తదితరులున్నారు.

కాలువ గండి పూడ్చివేత



గాంధారి(ఎల్లారెడ్డి) : గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని గుజ్జుల్ డ్యాం పంట కాలువకు గండి పడింది. దీంతో గత ఖరీఫ్ సీజన్‌లో నీరు వృథాగా పోయింది. పంటలకు నీరందక రైతులు నష్టపోయారు. నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు మరమ్మతులు చేయలేదు. మళ్లీ ఖరీఫ్ సీజన్ దగ్గర పడడంతో ఆయకట్ట రైతులు సొంత డబ్బులతో రాళ్లను పోగు చేసి ట్రాక్టర్లతో రాళ్లను తెచ్చి గండిని తాత్కాలికంగా పూడ్చివేశారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జెమ్లానాయక్, బీజేపీ నాయకుడు కిషోర్, బాలు, తమ అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో గన్యానాయక్, ముదాం సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక భజనలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శనివారం రాత్రి భక్తులు భగవన్నామ సంకీర్తనలతో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక భజనలు చేశారు. అలాగే ఆలయం ప్రాంగణంలోని వెంకటేశ్వర, దత్తాత్రేయ, మార్కండేయ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. రెండో శనివారం కావడంతో తాడ్వాయి మండలం నుంచే కాకుండా మెదక్, కరీంనగర్, హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చి ఈ భజనలో పాల్గొన్నారు. ఈ భజన కార్యక్రమం శనివారం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



ఎన్నికల నిబంధనలు వివరిస్తున్న రిటర్నింగ్ అధికారి రమేశ్ రాథోడ్



పెద్దకొడప్‌గల్ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు



భిక్కనూరులో ఈవీఎంతో వెళ్తున్న సిబ్బంది



మద్నూర్‌లో పోలింగ్ కేంద్రంలో తన కూతురిని నిద్రపుచ్చుతున్న మహిళా సిబ్బంది



రాజంపేట పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లలో సిబ్బంది

ఓటుకు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- ఏర్పాట్లు పూర్తి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలో ఓటింగ్‌కు ఏర్పాటు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రహీమొద్దీన్ తెలిపారు. మండలంలో 18 గ్రామాలకు గాను 32పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలో పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంపీడీవో సూర్యకాంత్ తెలిపారు. మండలంలోని 21 గ్రామాలలో 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, పోలీసు బందోబస్తు ఉందన్నారు.

భిక్కనూరులో..

భిక్కనూరు : మండలంలోని అన్ని గ్రామాలకు పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం వరకు చేరుకున్నారు. మండలంలోని 44 పోలింగ్ బూత్‌లకు గాను 267 మంది సిబ్బందిని నియమించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

బాన్సువాడ నియోజకవర్గంలో..

బాన్సువాడ : పార్లమెంట్ ఎన్నికలకు బాన్సువాడ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి రమేశ్ రాథోడ్ అన్నారు. ఆదివారం ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాల వద్ద ఎన్నికల నిర్వహణ కోసం సిబ్బందికి ఈవీఎంలు, ఓటర్ జాబితాలతో పాటు సామగ్రిని అందజేశారు. నియోజకవర్గంలో 258 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయని, 26 రూట్లలో సెక్షన్ ఆఫీసర్లు నియమించామన్నారు. నియోజకవర్గంలో 40 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. నియోజకవర్గంలో 2500 మంది సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో విధుల్లో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్) : జుక్కల్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని 8 మండలాల్లో 255 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మొత్తం ఎన్నికల సిబ్బంది విధులకు 2,567 మంది నియమించామన్నారు. మొత్తం 265 మంది పోలీసు సిబ్బంది ఉన్నారని, నియోజకవర్గంలో 37 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట : మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాజంపేట మండల సెక్టోరియల్ అధికారి రాజేశం తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గం పరిధిలో 9 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలో 15 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. రాజంపేట మండలంలో 24 పోలింగ్ కేంద్రాల్లో 2,2028 మంది ఓటర్లు ఉన్నారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో..

ఎల్లారెడ్డి: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎల్లారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్‌లో పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ప్రభాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి పోలింగ్ సిబ్బంది చేరుకుని వారికి కేటాయించిన పోలింగ్ సామాగ్రి, కంట్రోల్ యూనిట్‌లను పరిశీలించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 270 పోలింగ్ కేంద్రాలు ఏర్పాట్లు చేశామన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహణకు 1,080 మంది సిబ్బందిని నియమించామన్నారు. నియోజకవర్గ పరిధిలోని 270 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఈవీఎంలు, పోలింగ్ సామగ్రితో తరలివెళ్లారు.



ఎల్లారెడ్డిలో ఈవీఎంలు, సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం రాత్రి బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై సుధాకర్ తనిఖీ చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, ఎన్నికల అధికారులు, సిబ్బంది చేరుకోవడంతో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం ఈవీఎంలు, సామగ్రితో ఎన్నికల అధికారులు చేరుకున్నారు. ఆయా మండలాల్లో 255 పోలింగ్ కేంద్రాలకు గాను 26 రూట్‌లకు పోలింగ్ అధికారులు, ఈవీఎంలతో ప్రత్యేకమైన భద్రత నడుమ చేరుకున్నారు.

బాన్సువాడ రూరల్‌లో..

బాన్సువాడ రూరల్ : మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం జరిగే జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి జరిగే ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ సిబ్బంది ఆయా గ్రామాలకు చేరుకుని ఏర్పాట్లు చేసుకున్నారు. మండలంలోని తాడ్కోల్‌లో యువ ఓటర్ల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, బోర్లం గ్రామంలో దివ్యాంగులకు ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు.

కామారెడ్డి క్రైం : తమకు కేటాయించిన ఎన్నికల విధులను నిర్వర్తించేందుకు జిల్లాలోని ఆయా నియోజకవర్గాలకు చెందిన పోలింగ్ సిబ్బంది ఆదివారం తరలివెళ్లారు. దీంతో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. కామారెడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సందర్శించారు. పోలింగ్ సిబ్బందిని 27 రూట్ల ద్వారా 27 బస్సులలో నియోజక వర్గంలోని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ రంగనాథ రావు, మునిసిపల్ కమిషనర్ సుజాత తదితరులున్నారు.



మద్నూర్‌లో సిబ్బందికి డ్యూటీలు వేస్తున్న ఎస్సై



పెద్దకొడప్‌గల్‌లో పోలింగ్ ఏర్పాట్లలో సిబ్బంది



ఎల్లారెడ్డిలో ఈవీఎంను చెక్ చేస్తూ..



బాన్సువాడ ఎస్‌ఆర్‌ఎన్‌కే కళాశాలలో..



కామారెడ్డి పట్టణంలో..



బోర్లంలో దివ్యాంగుల ప్రత్యేక పోలింగ్ కేంద్రం



మద్నూర్‌లో సూచనలు ఇస్తున్న రిటర్నింగ్ అధికారి



ఎల్లారెడ్డిలో..



మహమ్మద్ నగర్‌లో..



బూర్గుల్‌లో..

మోడల్ పోలింగ్ బూత్‌ల అలంకరణ



బిచ్కుందలో అలంకరించిన మోడల్ పోలింగ్ బూత్



బూర్గుల్‌లో..

బిచ్కుంద(జుక్కల్) : ఎన్నికల పోలింగ్ సందర్భంగా అధికారులు మండల కేంద్రంలో 126 పోలింగ్ బూత్‌ను మోడల్ పోలింగ్ బూత్‌గా ఎంపిక చేశారు. బూత్‌లో టెంట్లు, లైట్లతో తీర్చిదిద్దారు. 42 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఎన్నికల సిబ్బంది తమ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకొని అన్ని ఏర్పాటు చేసుకున్నారు. సిబ్బంది కోసం అధికారులు అన్ని వసతులు కల్పించారు. అన్ని బూత్‌లలో ఓటర్లకు నీడ కల్పించడానికి టెంట్లు, తాగునీరు, వికలాంగులకు వీల్‌చేర్ వసతులు ఏర్పాటు చేశారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని మాగి, బూర్గుల్ గ్రామాల్లో ఎన్నికల అధికారులు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు వందశాతం తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మికం

గోపాల్‌పేట్‌లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట్‌లో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. గ్రామానికి చెందిన నంగునూరి రాధా–మాణిక్యం దంపతులు పట్టణంలోని వైశ్యసంఘంలో 108 జంటలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలను జరిపించారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో 108 జంటలు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

నిజాంసాగర్(జుక్కల్) : ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కోరారు. ఆదివారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి దేశ అభివృద్ధికి పాటు పడాలన్నారు. బీఆర్‌ఎస్ దొంగల మాటలు నమ్మవద్దని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని ఐదేళ్లపాటు ప్రజలు తన సేవలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. గోర్గల్‌లో జరిగిన అలజడిపై విచారణ చేపట్టి బాధ్యులపై శాఖాపరమైన చేపట్టాలన్నారు.



మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు తోట రాజు, కోరమండల్ సాయాగౌడ్, సాయిలు, తుకారం తదితరులు ఉన్నారు.

కేంద్రాల్లో వసతుల్లేక ఇబ్బంది

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని 241, 242 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై ఎన్నికల అధికారులు నిరసన వ్యక్తం చేశారు. రెండు పోలింగ్ కేంద్రాల్లోని గదుల్లో ఫ్యాన్లు లేవని, గదులపై కప్పులు సరిగ్గా లేకపోవడం పట్ల ఎన్నికల అధికారులు అసహనం వ్యక్తం చేశారు. వర్షం వస్తే పోలింగ్ నిర్వహణ ఏట్లా అంటూ పోలింగ్ అధికారులు వాపోయారు. రెండు పోలింగ్ కేంద్రాల తీరుపై రూట్ అధికారి సురేశ్ దృష్టికి తీసుకు వెళ్లారు.

కూలిన టెంట్లు..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఆదివారం వీచిన ఈదురు గాలులకు టెంట్లు కూలాయి. పోలింగ్ సిబ్బంది కోసం ఏర్పాట్లు చేసిన టెంట్లు కూలడంతో ఎవరికి ప్రమాదం సంభవించలేదు. పోలింగ్ సిబ్బంది వారి సామగ్రిని తీసుకుని బయటకు వెళ్లిన అనంతరం టెంట్లు కూలడంతో ఎవరికి ప్రమాదం జరగలేదు.



మహమ్మద్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న సిబ్బంది



ఎల్లారెడ్డిలో కూలిన టెంట్లు

పీహెచ్‌డీ గ్రహీతలకు సన్మానం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు ఇటీవల పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఆదివారం పీహెచ్‌డీ పట్టా అందుకున్న యువకులు రాజారాం బాలరాజు(రూరల్ డెవలప్‌మెంట్), కదారి దేవరాజు(ఎడ్యుకేషన్ సైకాలజీ)ను యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది నారాయణ, శ్రీనివాస్, వంశీ తదితరులున్నారు.

గోధుమ రవ్వతో ఓటుపై అవగాహన



మద్నూర్(జుక్కల్) : ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరుతు గోధుమ రవ్వతో భారత దేశ పటంతో పండరి అనే యువకుడు అవగాహన కల్పించాడు. మండల కేంద్రానికి చెందిన కర్రెవార్ పండరి ఆదివారం గోధుమ రవ్వ ఉపయోగించి భారతదేశ చిత్రం వేసి అందులో రంగులతో చేతి వేలిపై సిరా గుర్తు వేశాడు.

సంక్షిప్తం

దీర్ఘకాలిక రోగాలకు యోగా చికిత్స శిబిరం

కామారెడ్డి అర్బన్ : దీర్ఘకాలిక రోగాలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ. వేలల్లో ఖర్చు చేసే బదులు ప్రాచీన యోగా వైద్య విధానాలను ఆచరించి నయం చేసుకోవాలని నేపాల్‌కు చెందిన యోగిరాజ్ గురు కేశవ్ ఉపాధ్యాయ, కుసుమ్ సునర్ అన్నారు. ఆదివారం స్థానిక స్నేహపురి కాలనీ పార్క్‌లో యోగా చికిత్స శిబిరం ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహపురి కాలనీ పార్క్ ఏరియా అధ్యక్షుడు గ్యార సాయిలు, ప్రతినిధులు ప్రేంరాజు, వసుంధర పాల్గొన్నారు.

రెండు సమస్యాత్మక గ్రామాల గుర్తింపు

బిచ్కుంద(జుక్కల్) : ఎన్నికల్లో సందర్భంగా మండలంలో రెండు సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. వాజిద్‌నగర్, బిచ్కుంద సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశామని, పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల అధికారుల నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్సై కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆదిశంకరాచార్య జయంతి



కామారెడ్డి అర్బన్ : అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ఒక్కటి చేసిన భారతీయ ఆధ్యాత్మిక జగద్గురువు ఆది శంకరాచార్యులని వేద పండితులు గంగవరం ఆంజనేయశర్మ అన్నారు. శంకరచార్య జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని వివిధ ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా ఆయన విగ్రహాలకు అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. శ్రీసంకష్టహర గణపతి, శ్రీశారదామాత, ఇష్ట కార్యసిద్ధి, దేవి వీహార్ శ్రీహన్‌మాన్ ఆలయాల్లో ఆది శంకరచార్యల వారి విగ్రహాలకు అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కే మహిపాల్‌రెడ్డి, అయిత బాలకిషన్, నీలకంఠం, దేవాచారి, కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

బాన్సువాడ రూరల్ : తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2024–25గాను ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని కొత్తాబాదిలోని మోడల్‌స్కూల్ స్కూల్ ప్రిన్సిపల్ ఫకీరయ్య తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉద్యోగులంతా ఓటెయ్యాలి

కామారెడ్డి అర్బన్ : ఎన్నికల విధుల్లో పాల్గొనని ఉద్యోగులందరు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఉద్యోగి ఎక్కడ ఉన్న బాధ్యతగా తాను, కుటుంబ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చైతన్యం చేయాలని టీఎన్‌జీఓస్ అధ్యక్షుడు అన్నారు.